# దేవుడు వెలిసాడు

— ఎ. ఎస్. జగన్నాథ శర్మ

ఏటి మీదనించి చలిగాలి వీస్తోంది.

మూడు రోజులై ముసురు. క్షణ క్షణం పిట్టవిసురుల వల్ల వాతావరణం అంతా చెమ్మగా ఉంది.

పంబాల రొంపులు హరికేన్ దీపాన్ని చూరుకో వంచి ఉంచిన సన్నని ఇనుప రేకుకు తగిలిస్తూ—"వస్తాను, బాబూ! పూజా పొద్దు పోయింది" అని వెళ్ళిపోయాడు, ఊళ్ళో ఉన్న రామమందిరంలో పడుకోవడానికి.

జగన్నాథం పాగాను మడతల్లో విప్పుతుంటూ కూర్చున్నాడు, తనకంటూ చూరు కింద వేసిన పట్టె మంచం మీద. అటూ ఇటూ చూస్తూ ఆలోచిస్తున్నాడు. దగ్గరగా ఉన్న శూద్రుల పేట ఇళ్ళ మీద నించి పొగ మెత్తని మేఘాల్లా లేస్తూ కదులుతూంది. దూరంగా మాల పేటలో డప్పులు వినిపిస్తున్నాయి. పొగాకు చుట్ట చుట్టి వెలిగించుకున్నాడు.

* * *

ఆ రోజు ఆ ఊరి అమ్మ తల్లి పండుగ.

పెద్ద బుగత ఇంట్లో మనుష్యులు గలిబిగా, గాభరాగా తిరుగుతున్నారు. బుగతగారు నౌకర్లను, కంబార్లను బొంగురు గొంతుతో మీద పడి కొట్టినట్టు కసురుతూ, తిడుతూ పనులను పురమాయిస్తున్నారు. ఎవరి పని వారు భక్తితోను, భయంతోను చేసుకు పోతున్నారు. అయినా, బుగతగారు గంభీరంగా గదమాయించడంలో వాళ్ళకి తృప్తి; ఆతనికి సంతృప్తి.

అతని కసురులో వాళ్ళకి అభిమానం కనిపిస్తుంది.

అతని కోపంలో వాళ్ళకి అమాయకత్వం గోచరిస్తుంది. అందుకే ఆ ఊరిలో చాలా మంది అతనిని మకుటం లేని మహారాజన్నా, మోతుబరి బుగతన్నా చెప్తుంటారు.

చెయ్యెత్తు మనిషి. బలంగా, బొందాగా ఉంటాడు. ఖరీదైన లాల్చీలు, ఖరీదైన అలవాట్లు కలవాడు. అందర్నీ కావాలని దగ్గర చేర్చుకుంటాడు. మనసునీ, మంచితనాన్నీ దోసిళ్ళతో పంచి ఇస్తాడు. ఊరు ఊరంతటినీ ఒక్క మాట మీద, ఒక్క బాట మీద నడిపిస్తున్నాడు. ముసలి వాళ్ళకి అతనంటే గౌరవం. చిన్నవాళ్ళకి అతనంటే భక్తితో కూడుకున్న భయం.

ఊరి అమ్మతల్లి అతని పుట్టింటి బిడ్డ అంటారు అక్కడి వాళ్ళు.

"అవ్వ(నా! అమ్మతల్లి మా ఆడపడుచు. ఆవిణ్ణి సంవత్సరానికి కొక పాలైనా పిలిచి పండుగ సరదాలతో, సంబరాలతో ఘనంగా జరిపించకపోతే మా వంశానికే వెలితి. ఊరికే అప్రతిష్ఠ" అంటాడతను.

ప్రజలంతా "ఓహోహో!" అంటారు—

అక్కడ తరుచూ జరిగే తీర్థాలకీ, జాతర్లకీ, కళ్యాణాలకీ అతని చెయ్యి పెద్దగా ఉంటుంది. అతని అజమాయిషీ లోనే గత పన్నెండేళ్ళుగా అమ్మ తల్లి పండుగ ఏ లోటూ లేకుండా వైభవంగా జరుగుతూంది. ఆనవాయితీ పెత్తనం చెల్లించడం ( చలాయించడం ) అతని కెంతో ఇష్టం. దానికోసం ఊరికి కుడి వైపున ఉన్న మామిడితోట అమ్మకం జరిగింది. ఊరవతల కొండకు పక్కగా ఉన్న మెట్టు భూమి చిల్లరగా చెల్లగొట్టడం జరిగింది. ఇంకా ఎన్నో జరిగాయి.

ఎన్ని జరిగినా స్థిరంగా నిలబడ్డ వ్యక్తి. 'వ్యక్తిత్వం కలవాణ్ణి' అనుకునే పెద్ద బుగత.

వన్నగా వసున్న రాసుకుని, కానీ అంత బొట్టు పెట్టుకుని, పట్టుచీర పరపర లాడించుకుంటూ బుగత దగ్గరగా చేరింది బుగతమ్మ—సోదెమ్మ.

"ఏమండీ! మన జగ్గుకి మొన్న మొన్నాడో వాంతులు, విరోచనాలు అయితే అమ్మతల్లికి ముక్కుపుడక చేయిస్తానని మొక్కుకున్నాను, తగ్గించమని. మీతో చెప్పే ఉంటాను. చేయించారా?" అడిగింది.

"మరోసారి నన్నడగాలటోయ్. చేయించాను. సాయంత్రం సంబరం వేళకి కంసాలి వీరాస్వాతుడు తెస్తానన్నాడు." జారు మీసాల్ని దువ్వుకున్నాడతను.

ఆరాధనగా అతణ్ణే చూసిం దామె.

"అవునూ మన జగన్నాథం ఏడీ! అదే—జగ్గుగాడు. పండుగ వేళకు ఎక్కడ పోతున్నాడో ఏమిటో?"

"ఆఁ! ఈ తండ్రికి ఏం తీసిపోడు ఆ కొడుకు. గొడ్లపాకలో తనూ పులి వేషం కడతానని ఒకటే పోరు." నవ్విం దామె.

"లేకపోతే పిల్లి వేషం కడతాడటోయ్! అది నా రూపం. నా రక్తం." పొంగిపోతున్నా డతను, మాటల్లోనే ప్రవేశించిన పన్నెండేళ్ళ జగన్నాథాన్ని గొప్పగా చూసుకుంటూ.

జగన్నాథం పులివేషం కట్టుకున్నాడు. ఇంట్లో సంతోషంతో పరిగెడుతున్నాడు. అందరూ అరుస్తున్నారు; నవ్వుతున్నారు.

బుగతగారి ఒక్కగానొక్క కొడుకు జగన్నాథం ... వాళ్ళకి ప్రాణం.

* * *

దగ్గిరగా డప్పుల మోత వినిపిస్తూంది. చప్పట్లు, అరుపులు, కేకలు ఆ శబ్దంలో కలిసి చిత్రంగా ఉన్నాయి.

జగన్నాథం లేచి గుమ్మంలోకి వచ్చాడు.

మాల వాళ్ళు వెళ్ళి.

పెళ్ళికూతుర్ని, పెళ్ళి కొడుకుని కాగితం కిరీటాలతో ముస్తాబు చేశారు. వాళ్ళ కళ్ళ మీద నించి ఆకుల కాగితం పువ్వులు గొలుసు కట్టుగా జారుతున్నాయి. ఆ ఇద్దర్నీ వెనక ఇద్దరు భుజాల మీద ఎత్తుకుని మహాగా గెంతుతున్నారు. పెట్రోమాక్సు లైటు కాంతిలో, జల్లుకునే రంగు గుండలతో అందంగా వాళ్ళ మధ్య హరివిల్లులు విరుస్తున్నాయి.

నవ్వుతున్నారు.

తూలుతున్నారు.

అల్లరి చేస్తున్నారు.

ఎవరో మందుతూన్న గొంతుతో పాట పాడుతున్నారు.

"అప్పారావు కొండమీద రావిపిల్ల సందేలకి రమ్మంది పిట్ట సిలక..."

జగన్నాథాన్ని చూసిన ఊరేగింపులో అల్లరి తగ్గింది. పాడుతున్న పాట జంకి జనంతో కలిసిపోయాడు. నవ్వుకున్నా డతను. దంపతుల్ని ద్దర్నీ జాగ్రత్తగా ఉత్సవపు విగ్రహాల్లా దించారు.

"అయ్యగారి దండం పెట్టి అయిదో తనాన్ని కోరుకుండో సే." కొత్త జంటను పురమాయించాడు, వాళ్ళ పెద్ద.

నూతన వధూవరుల్ని సుఖసుఖ్యాప్తిగా ఆశీర్వదించాడు. "జానకీ" అని లోపలికి కేకేశాడు జగన్నాథం.

"వస్తున్నా, నాన్నా." చిన్న స్టైలు పళ్ళెంలో నిండుగా పసుపూ, కుంకుమా పోసుకుని మహాలక్ష్మిలా ప్రత్యక్షమైంది జానకి. పెళ్ళికూతురి కొంగు లాగి అందులో పోసింది. బోలెడు సిగ్గు పడుతున్న ఆ అమ్మాయి వైపు సంతోషంగా చూస్తూంది.

గిడ్డిలో 'బత్తెం' అమర్చి వాళ్ళు వెళ్ళిపోయారు.

తొలకరి వర్షాన్ని ఊహించుకుంది జానకి.

చెదిరిపోతూన్న ఆలోచనల్ని ఒక్కొక్కటీ లాక్కుని కూర్చున్నాడు జగన్నాథం.

* * *

పెద్ద బుగతకి ఏళ్ళై ఏళ్ళు పైబడ్డాయి. ఆ ఊళ్ళో రాజకీయాలు, మూకీ సినిమా హాలులు వెలిశాయి. యువతరం పెద్దగా విప్పుకుంది. అధికారాన్ని, ఆగ్రహాన్ని అణుచుకోలేక పోతున్నాడు బుగత. యువత రెచ్చిపోతూంది.

మొన్నెప్పుడో జాలరి సీతన్న పెళ్ళికి పెళ్ళి చేసుకుంటూ బుగతకి 'బత్తెం' పంపించలేదు. ఆనవాయితీ తప్పించాడో, లేక మరిచిపోయాడో? ఆ రోజుల్లో బుగత వీరావేశం సోదెమ్మ భరించలేక పోయింది. జగన్నాథం సహించలేక పోయాడు.

"కుక్కకి విశ్వాసం ఉంటుందని పెంచాను. పెంచిన కుక్కే కరిచింది.

వచ్చిపోవాలి. వచ్చిపోతాను.'' పదే పదే ఆ మాటల్నే అంటూ ఉన్మాదంగా అరిచాడు.

తండ్రి మానసిక స్థితి జగన్నాథానికి బాగా తెలుసు. అనవాయితీకి, అధికారానికీ అతని హయాంలో కించిత్ లోపం కలగకూడదు. కలిగితే ఆసమర్థుల్ని అని పెత్తి బాదుకునే బలహీనమైన మనిషి. దీర్ఘంగా ఆలోచించలేని మనస్సు.

సీతప్ప తన తండ్రి దగ్గర కొబ్బరి తోట కాపుగా పని చేసే సూరి కొడుకు. చిన్నప్పటినించీ వాడు 'బుగత, బుగత' అని చేతులు ముడుచుకుని నత్తలా పడి ఉండే రకం. అలాంటి వాడిలో ఈ మార్పును జీర్ణించుకోలేక పోతున్నాడు తండ్రి. మనిషికి మనిషి మీద అధికారం చలాయించడం ఎంత ఇష్టం!

అయిదారు రోజుల క్రితం రామ్మందిరంలో జరిగిన సీతా కళ్యాణానికీ ఇంతే జరిగింది.

పెద్ద బుగత వినోద కాలక్షేపంగా పౌరాణిక నాటకాన్ని ఏర్పాటు చేస్తూ వచ్చారు. కొందరు యువకులు చారిత్రాత్మక నాటకాన్ని ఆడమన్నారు. అభిప్రాయ భేదా లేర్పడ్డాయి. నానా హంగామా జరిగింది. ఉత్సవంలో ఎవరి కెవరూ తెలియకుండా రాళ్ళు రువ్వుకున్నారు. కళ్యాణం అసంతృప్తిగా ముగిసింది. ఆ తెల్లారు ఝామున పెరట్లో కసొర్పుని కళ్ళంట నీరు పెట్టుకున్న తండ్రిని చూసి నవ్వాలో, ఏడవాలో తెలిసింది కాదు జగన్నాథానికి.

వ్యాపారరీత్యా మూకీ సి నిమాహాలు యజమాని ఇప్పుడు స్టేజి కట్టి చరిత్రాత్మక నాటకాల్ని, సాంఘిక నాటకాల్ని ప్రదర్శింప జేయిస్తున్నాడు. పదిమంది పలుకుబడిని సంపాదించుకుంటున్నాడు. బుగతకి ఇదొక పెద్ద సమస్యగా ఏర్పడింది. ఆతని కేదో 'లోటు' జరుగుతూంది అనిపించింది. "పరువుకోసం" అంటూ డబ్బు విపరీతంగా ఖర్చు చేస్తున్నాడు. డ్రామా కంపెనీలను పిలిపించి ఉచితంగా ప్రదర్శన లిప్పిస్తున్నాడు. ఫలితంగా ఏటి కిపతల గట్టు మీది మిద్దె ఇళ్ళు రెండూ అమ్మేశాడు.

సోదెమ్మకు ఇదంతా అయోమయంగా ఉంది. తను పుట్టింటి నించి ఆడపిల్ల కట్నంగా తెచ్చుకున్న బంగారం కూడా భర్త పరువుకోసమే ఖర్చు అయింది. ఒకటేగా మిగిలి ఉన్న మెళ్ళో నెక్లెసు అతని 'హోదాకోసం' లాక్కుపోతుంటే వద్దని వారించింది. ఏడ్చింది. రెచ్చిపోయిన అతని చేతిలో మొదటి సారిగా దెబ్బలు తింది. అది కొడుకు దూమ్మాంటే కుంచించుకుపోయింది.



బుగతకి డబ్బు బాగా అవసర మవు తూంది. ఈ ఏడాదికి మరో మూడు మాసాలలో అమ్మ తల్లి పండుగ జరపబో తున్నాడు, ఎలా లేదన్నా వెయ్యి రూపా యలు అవసరం. ఉన్న తిండిగింజలు అమ్మేస్తే పస్తుల పాలవ్వాలి. ఆలోచించి, కొడుక్కి పెద్దింటి సంబంధాన్ని తల పెట్టి పెళ్ళి నిర్ణయించాడు.

జగన్నాథానికి పెళ్ళి అయింది.

అమ్మతల్లి పండుగను ఘాటంగ్ా చేశారు. సంబర సన్నాహాలు పెద్ద ఎత్తున ఆడంబరంగా జరిగాయి. ఇప్పుడు పెద్ద బుగతకి తీరిక లేకుండా ఉంటూంది పాటలతో. ఉత్తినే పదిమందిని పోగు చేసుకుని గొప్ప చెప్పుకోవటం అలవాటు చేసుకున్నాడు.

మనిషికి పోటీ ఏర్పడకూడదు. ఏర్పడితే గెలుపుకోసం సర్వాన్నీ త్యజించే గుణం కొందరిలో ఉంటుంది. అది స్వార్థంకోసమైనా పెరుకుంటుంది. అది పెద్ద బుగతలో పరివ్యాప్తమైంది.

సంబరం యథాప్రకారంగా జరుగు తూంది. గర్వంగా పెద్ద బుగత మీసాలు దువ్వుకుంటున్న వేళలో ఎదురు తిరిగింది యువతరం.

ఊరేగింపును మాలపేటలోనించి జరపమన్నారు. కాదని పెద్ద బుగత అసమ్మతి ప్రకటించాడు. అది తీరు కాదన్నాడు. సంప్రదాయం కాదన్నాడు. శూద్రుల పేటలోనించే మళ్ళించాలని పట్టుబట్టాడు. జనంలో రెండు చీలికలు ఏర్పడ్డాయి. మాటా మాటా పెరిగింది. కొట్లాట జరిగింది. సంబరం రక్తం కోరింది. పెద్ద బుగత తల మీద ఓ పార్టీ జనం కర్రలు నృత్యం చేశాయి. బుర్ర చితికిపోయింది. పరిస్థితి చేదాటి పోయింది. పెద్ద బుగత మామూలు మనిషిగా కన్ను మూశాడు.

పోదెమ్మ ప్రజల మీద విరుచుకు పడింది, తిట్లతో, శాపనార్థాలతో. శోకాన్ని మరిచిపోలేక పోయిం దామె. పిచ్చిదై పోయింది. పల్లె వీధులు ఆమె వికృత చేష్టల్ని నగ్నంగా చూస్తున్నాయి.

జగన్నాథానికి ఏమీ అంతు బట్టటం లేదు. తల్లిని తెచ్చి ఇంట్లో పెట్టుకున్నా పారిపోతూం దామె. విచారిస్తున్నాడు. బాధపడుతున్నాడు. ఏడుస్తున్నాడు.

కొందరి జీవితాల పరిష్కారాలన్నీ ఎవరి బ్రతుక్కి వారే నిర్ణయించు కుంటారు, దైవికంగా. ఎదటి వారి ఆలోచన ఏమాత్రం సఫలం కాదు.

ఈ సారి తల్లిని తెచ్చి ఇంట్లో అదు పులో ఉంచుకోందాం అనుకున్న జగన్నా థానికి ఓ నాడు తల్లి శవం పాడుబడ్డ నూతిలో దొరికింది.

అంత్యక్రియలు స్వజాతీయంగానే జరిపించాడు. ఎదురు తిరుగుతున్న విధికి సవాల్‌గా తొడ చరిచాడు.

* * *

చిన్నగా జల్లు కురుస్తూంది.

చలిగాలి ఎక్కువైంది.

జగన్నాథం మంచంలో ముడుచుకుని కూర్చున్నాడు.

గత స్మృతులు మనిషి నరనరాల్లో బాధ లాంటి విద్యుత్తును ప్రవహింపచేసి, వణుకునూ, విస్పత్తవనూ కలిగింప చేస్తాయి. తీరని నరకాన్ని సృష్టిస్తాయి.

జగన్నాథం బిగుసుకు పోతున్నాడు.

* * *

తండ్రి పోయాడు.

సంప్రదాయాలు మిగిలాయి.

తల్లి పోయింది.

నిందలు మిగిలాయి.

తల్లిపట్ల సరియైన బాధ్యతను నిర్వర్తించ లేక పోయాడు అన్నారు జగన్నాథాన్ని.

ఇప్పటికీ జగన్నాథం ఏడాదికి ఓ సారి అమ్మతల్లిని ఊళ్ళోకి తీసుకు వస్తాడు ( తీసుకురావాలి ). సంబరాన్ని మాలపేట మీదనించే జరిపిస్తాడు. సీతా కళ్యాణానికి పూర్తి బాధ్యత వహించకున్నా, మంగళ సూత్రాలు రెండూ వేయిస్తాడు.

పాజంలు, హాయాంలు ఇష్ట పడడు. అధికారాల్నీ, అశ్రితజనుల్నీ అసహ్యించుకున్నాడు. సామాన్య ప్రజలలో ఒకడుగా ఉంటున్నాడు.

రెండు గదులున్న రెల్లు గడ్డి ఇల్లు. అయిదెకరాల పొలం. వడ్డీ వ్యాపారస్థుల దగ్గర ఏడెనిమిది వందల అప్పు. పక్ష వాతంతో తీసుకుంటున్న భార్య. ముగ్గురు పిల్లలు. జగన్నాథం బాధ్యతలు గల కుటుంబి.

పెద్దమ్మాయికి ఈడు వచ్చింది. పెళ్ళి చెయ్యాలి. కుర్రాణ్ణి సెకండరీ స్కూల్లో జాయిన్ చెయ్యాలి. మూడోది జానకికి లివర్ పెరిగింది. మందులూ మాకులూ పొయ్యాలి.

అంతా గజిబిజిగా ఉంది జగన్నాథానికి. అతణ్ణి తండ్రి వస్తువులా ఉపయో గించుకున్నాడు. మట్టితో కొట్టి, పొగడిసి పెద్దవాణ్ణి చేసి, పెళ్ళి చేసి, సంసారపు ఇరుకు కూపంలోనికి నెట్టాడు. పాపం! గింజాకుని తిరిగి రాలేక పోతున్నాడు; ఉంటూ వేలాడలేక పోతున్నాడు.

శారీరక వాంఛ అణుచుకోలేని పెద్దమ్మాయి అక్కడి పల్లెయుడితో అక్రమ సంబంధాన్ని ఏర్పరుచుకుంది. ఆమెను అదిలించలేని అసమర్థతతో, చింతతో పక్షవాతంతో తల్లి చనిపోయింది.

సెకండరీ స్కూల్లో ప్రవేశించిన కొడుకు ఊహాలు చిత్రాతిచిత్రంగా ఉండటం వల్ల పక్కను వదిలి పట్టి పట్నం పారిపోయాడు.

రోజులు గడుస్తున్నాయి.

బ్రతుకులకోసం రెండెకరాలమ్మకం జరిగింది.

ఇప్పుడు రూపు వంగిపోతున్న ఆ రెల్లు గడ్డి ఇంట్లో పెళ్ళిలేక ( కాక ) ఇంటి పనులు చూసుకుంటూ, కుట్టుపని చేసుకుంటూ సిగ్గుతో బయటకు రాలేక పోతున్న పెద్దమ్మాయి. మెట్రిక్ చదువు కుని కళ్ళ నిండా కళ్యాణపు కోర్కెలు నింపుకున్న జానకి. జీవితం ప్రదర్శించిన వడదెబ్బలకి చిక్కిపోయి, వడలిపోయిన వలల్లే అయిదేళ్ళ జగన్నాథం. వీళ్ళను ఆశ్రయించి ప్రేమిస్తూ తిరిగే కంబారి రావులూ ఉండీ లేనట్లుగా ఉంటున్నారు.

* * *

జల్లు బలాన్ని పుంజుకుంది.

వర్షం కురుస్తూంది.

ఆలోచనలు జగన్నాథాన్ని కుదిపి, పరుగెత్తించి, అలిసింప చేశాయి. అతనికి ఉక్క పోస్తున్నట్టుగా ఉంది. దూరంగా డప్పుల మోత అసహ్యంగా, అసందర్భంగా వినిపిస్తున్నట్టుగా ఉంది.

జలగల్లా ఆలోచనలు ఇంకా పీకుతూనే ఉన్నాయి.

అతనికి ఉన్న మూడెకరాలూ అమ్మి జానకికి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాడు. అయిపోగా డబ్బు మిగిలితే పెద్దమ్మాయికి ఓ కుట్టు మిషను కొని పెడదాం అనుకుంటున్నాడు. తండ్రిగా 'కూతుళ్ళ' భవిష్యత్తులకు ఆ విధంగా పరిష్కారాన్ని ఆశించాడు.


"బాబుగారూ!" వర్షంలో తడుసు కుని వచ్చాడు కంబారి రావులు.

తేరుకుని జగన్నాథం వాడి వైపు చూశాడు.

వాడు ఆత్రంగా, ఆనందంగా చెప్పుకు పోతున్నాడు.

"బాబుగారూ, దేవుడు మీ కడుపున పుట్టాడు. మన మూడెకరాల్లోనూ కలియుగ దైవం వెంకటేశ్వర సామి వెలిసాడు. జనం జనం అంతా పొర్లం లోనే తిరగబడుతున్నారు. ఏ టలా సూత్తారు? ఇందాకట్నే 'మాదిగోళ్ళ' పెళ్ళయిందిగా! సిత్తుగా తాగేసిన నా కొడుకులు లోడ్డర మన బావుల్లో పడి కొట్టుకున్నారు. అక్కలో ఎవుడో పవణ్ణో కొడదామని మన గట్టు మీది బొమ్మర్లో పడున్న రాయిని ఎత్తేట్ట. ఇంకేటి— ఎలుగులో నూసి నరికి దేవుడు! ఎదవ నా కొడుకు లందరూ సాష్టాంగోడి పోయి దండాలెట్టేస్తున్నారు ..."

జగన్నాథం భయంతో వణుకు తున్నాడు.



ఆలోచన

చిత్రం—ప్రభ (బాపూజీనగర్)

"సాన్రోజులికి ఈ ఊళ్ళో ప్రెత్యెచ్చ దైవం ఎలిసాడు. ఒహ్హో తీర్థాలేటి! జనం వేటి! జాతర్లేటి! కల్ల భాగ్యం ..."

జగన్నాథం కళ్ళల్లో నీరు తిరుగు తున్నాయి.

రావులు ఉత్సాహం అణిగిపోయింది. దిగాలుగా బాబుగారి వైపు చూశాడు.

"బాబూ! దేవు డెలిసిన బూమి సాగుకీ, అమ్మకానికీ పనికిరాదు గదూ!"

"అవున్రా!" జగన్నాథం కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.

'గొల్లు'గా డప్పులు మోగుతున్నాయి. అవి అతని గుండెల్ని పేల్చేస్తున్నాయి.

వికటాట్టహాసం చేస్తున్నాడు భగవంతుడు.

ఆ విధంగా ఆ ఊళ్ళో వెలిశాడు దేవుడు!